క్లుప్తంగా

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి


బాలసూర్యారావు, సీఐ, పరవాడ

పరవాడ: వినాయక చవితి వేడుకలు జరిపే నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతులు తప్పసరిగా తీసుకోవాలని పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చవితి వేడుకలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించాలనుకునే వారు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గృహాలు, కల్యాణ మండపాల్లో జరిపే వినాయక చవితి వేడుకలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదన్నారు. చవితి వేడుకలను పురస్కరించుకుని ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

నేడు పింఛన్ల పంపిణీ

పరవాడ: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఒక రోజు ముందుగా శనివారం ఉదయమే పింఛన్లు బట్వాడా చేసేందుకు సన్నాహాలు చేసినట్లు పరవాడ ఇన్‌చార్జి ఎంపీడీవో హేమసుందరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పింఛనుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగా(ఆగస్టు 31) పింఛన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులు గ్రామాలకే వచ్చి పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు బట్వాడా చేస్తారని పేర్కొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుడి సన్నిధిలో భక్తులు

పరవాడ: మండలంలోనిరావాడ శివారు బొట్టవానిపాలెం గ్రామంలో కొలువుదీరిన శ్రీకృష్ణుడి ఆలయంలో శ్రీకృష్ణాజన్మాష్టమి ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుడికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామిని దర్శించుకున్న వారిలో అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి పల్లా గోవిందు, బీజేపీ నాయకులు దాలిబోయిన సంజీవరావు, రావాడ మాజీ ఎంపీటీసీ కావలిరాజు, కోరుకొండ నానిబాబు, అప్పలరాజు, బూస రామకృష్ణ, ఎం.నాగరాజు, యువత, మహిళలు ఉన్నారు.


వెంకన్నకు పంచామృతాభిషేకం


అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. చాతుర్మాస దీక్షల్లో భాగంగా శ్రీనివాస హోమం, సుదర్శన హోమం జరిపారు. శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఉర్రూతలూగించిన మైఖేల్ జాక్సన్ పాటలు

- ధ్వని అనుకరణతో ఆకట్టుకున్న డీటీఎస్ రమేష్


నోటితో సంగీతం అందిస్తున్న డీటీఎస్ రమేష్

మద్దిలపాలెం: పాప్ కింగ్ మైకేల్ జాక్సన్ జయంతి వేడుకలను శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారుడు రమేష్‌కుమార్(డీటీఎస్ రమేష్) నోటి ద్వారా మైకేల్ జాక్సన్ పాటలకు సంగీతాన్ని సమకూర్చి ఆహుతులను ఆకట్టుకున్నారు. సుమారు 15 పాటలకు రమేష్ ధ్వని అనుకరణ మ్యూజిక్ హోరెత్తించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఖాన్‌లు ప్రసంగిస్తూ మైకేల్ జాక్సన్ పాటలకు నోటి ద్వారా సంగీతం సమకూర్చడం అద్భుత ప్రక్రియ అన్నారు. రమేష్ ప్రతిభ నలుదిశలా తెలియాలని ఆకాంక్షించారు.

రేషన్ బండి.. ఇక ఇంటింటికీ రాదండి!


ఎండీయూ వాహనం

- ఇంటి ముంగిటే రేషన్ సరకుల పంపిణీకి చెల్లు
- ఇకపై రేషన్ డిపోల వద్ద లబ్ధిదారుల పడిగాపులే
- మూలకు చేరనున్న ఎండీయూ వాహనాలు
- మండలంలో ఉపాధి కోల్పోతున్న 28 మంది

భూమి గుండ్రంగా తిరిగినట్లు.. కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రజల్ని కష్టపెట్టేందుకు సిద్ధమవుతోంది. గతంలో రేషన్ దుకాణాల్లో సరకులు ఎప్పుడొస్తాయో తెలియక, తీరా వచ్చాక గంటల తరబడి లైన్లలో పడిగాపులు కాయలేక జనాలు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ తిప్పలు తొలగాయి. ఎండీయూ వాహనాలతో ఇంటి వద్దకే వచ్చి, ఖచ్చితమైన తూనికలతో సరకులు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మళ్లీ పాత పద్ధతివైపే మొగ్గు చూపుతోంది. దీంతో మండల పరిధిలో రేషన్ లబ్ధిదారులు, పాత కష్టాలను తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పథకాల లబ్ధిని నేరుగా ఇంటి వద్దకే అందించే వ్యవస్థలకు శ్రీకారం చుట్టారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో పాటు రేషన్ సరకుల్ని ఇంటికే చేరవేసేలా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సేవల్ని ప్రజలకు దూరం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్లను నిలిపేశారు. ఇప్పుడు ఎండీయూ వాహనాలను లక్ష్యంగా చేసుకున్నారు. సెప్టెంబర్ నుంచి ఏ క్షణంలోనైనా ఈ వాహనాలను నిలిపేసి, పాత పద్ధతిలో రేషన్ దుకాణాల నుంచి సరకులు తీసుకునే విధానం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు మూలకు చేరడంతోపాటు, వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న నిర్వాహకులు బతుకులు ప్రశ్నార్థకంగా మారాయి.

పాత కష్టాలు తలచుకుంటే గుబులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు రేషన్ సరకులు తెచ్చుకునేందుకు పడ్డ కష్టాలు జనాల కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. పనులు మానుకుని మరీ రేషన్ దుకాణాల ముందు పడిగాపులు కాయాల్సి వచ్చేది. చిన్నచిన్న గ్రామాలైతే కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామపంచాయతీలోని రేషన్ షాపు వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ఆ రోజు షాపు మూసేస్తే.. ఉస్సూరంటూ కాళ్లీడ్చుకుని మరో రోజు మళ్లీ వెళ్లాల్సిందే. వీటికి తోడు తూనికల్లో వ్యత్యాసాలు, దోపిడీ గురించి చెప్పాల్సిన పనిలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేయడంతోపాటు, ప్రజల కష్టాలను తొలగించేందుకు ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టింది. దీని ద్వారా గ్రామంలోనే ఉన్న యువతకు కొంత ఉపాధి కూడా కల్పించినట్లయింది. తాజా కూటమి ప్రభుత్వ ఆలోచనతో ప్రజలకు కష్టాలు దగ్గరవడంతోపాటు, యువతకు ఉపాధి దూరం కానుంది.

మండల వివరాలు	
గ్రామ పంచాయతీలు	24
తెల్ల రేషన్ కార్డులు	21,609
సరకుల లబ్ధిదారులు	62,247
రేషన్ దుకాణాలు	31
ఎండీయూ వాహనాలు	14


ఇంటి ముంగిటకు వచ్చిన ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

యువత ఉపాధికి గండి

మండలంలో 14 ఎండీయూ వాహనాలున్నాయి. ఒక్కో వాహనం, అందులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్, ఇతర పరికరాలకు గత ప్రభుత్వం రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వెచ్చించింది. ఈ వాహనాల నిర్వాహకులకు ప్రతి నెలా రూ.21 వేలు ప్రభుత్వమే చెల్లించేది. ఇందులో వాహనం ఈఎంఐకి రూ.3 వేలు, పెట్రోల్ అలవెన్స్ రూ.3 వేలు, తూనికలు వేసే ఆపరేటర్/సహాయకుడికి రూ.5 వేలు, మిగిలిన రూ.10 వేలు వాహన నిర్వాహకుడికి మిగిలేది.

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఈ వాహనాలు మూలకు చేరితే ఒక్కో వాహనంపై ఆధారపడి, ఎంతో కొంత ఆదాయం పొందుతున్న ఇద్దరేసి వ్యక్తుల బతుకులకు భరోసా తగ్గినట్లే. ఒక్క సబ్బవరం మండలంలోనే 28 మంది ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. దీనికి తోడు ప్రజల ఇబ్బందులు సరేసరి.

వ్యాన్లు ఆపేస్తే చాలా కష్టం



గతంలో మా ఊరు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న వంగలి రేషన్ దుకాణానికి వెళ్లి నిత్యావసర సరకులు తెచ్చుకునేవాళ్లం. అక్కడికి వెళ్లేసరికి ఆ ఊరితోపాటు, మా ఊరోళ్లు ఎక్కువగా చేరి, మా వంతు వచ్చేసరికి గంటల తరబడి లైన్లో ఎదురుచూడాల్సి వచ్చేది. గత ప్రభుత్వంలో వ్యాన్ల ద్వారా ఇంటి దగ్గరే సరకులు అందించడం మొదలెట్టారు. మా కష్టాలన్నీ తీరాయి. ఇప్పుడు మళ్లీ రేషన్ దుకాణాలకు వెళ్లాలని అంటున్నారు. ఇది సరికాదు.

– వడిశల వెంకటలక్ష్మి, తెలుకులపాలెం

ఇంటి వద్దే రేషన్ అందించాలి



గత ప్రభుత్వంలో వ్యాన్ల ద్వారా మా ఇంటికే వచ్చి, సరకులు అందించే విధానాన్ని తెచ్చారు. కచ్చితమైన తూనికలు, కొలతలతో సరకుల్ని అందుకునేవాళ్లం. ఈ విధానాన్ని నిలిపేసి, పాత పద్ధతిలో రేషన్ సరకులను రేషన్ డిపోలకు వెళ్లి, తెచ్చుకోవాలని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే యథావిధిగా రేషన్ డిపోల వద్ద పడిగాపులు కాయాల్సిందే. ఈ ప్రభుత్వం కూడా దీన్నే కొనసాగిస్తే మాకు మేలు.

– నక్కెళ్ల సన్యాసమ్మ, రాయపురఅగ్రహారం

సెప్టెంబర్ వరకు యథావిధిగా..

ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు సెప్టెంబర్ నెలలో కూడా యథావిధిగా ఎండీయూ వాహనాల ద్వారానే నిత్యావసర సరకులు పంపిణీ చేస్తాం. ఆపై ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుంది. ఎండీయూ వాహనాల్లో సరకుల పంపిణీ నిలిపివేతపై ఇప్పటి వరకూ ఏ విధమైన ఆదేశాలు రాలేదు. ఇకపై తప్పనిసరిగా బియ్యంతో పాటు పంచదార కూడా పంపిణీ చేస్తాం.

– శేషు కుమారి, సివిల్ సప్లైస్ డీటీ, సబ్బవరం

వరములీయవే.. వరమహాలక్ష్మీ


సుజాతనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు


సాధూమఠం సంతోషిమాత గుడిలో పూజలందుకున్న అమ్మవారు


ఎస్ఆర్ పురంలో విశేషాలంకరణతో పూజలందుకున్న కనకదుర్గమ్మ


సబ్బవరం దుర్గాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

వైభవంగా ఆఖరి శ్రావణ శుక్రవారం పూజలు

పెందుర్తి: పవిత్ర శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పూజలతో పెందుర్తి ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని అమ్మవార్ల దేవాలయాలు, వైష్ణవ మందిరాలు కిటకిటలాడాయి. చినముషిడివాడ దరి అలివేలు మంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి 100 కిలోల పసుపు–కుంకుమలతో ప్రత్యేక పూజలు, పాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం దాదాపు వెయ్యి మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. విష్ణు, లలిత సహస్ర నామ పారాయణ చేశారు.

- ఎస్ఆర్ పురంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ప్రసాద వితరణ జరిపారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీమాత ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- సాధూమఠం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.
- పెందుర్తి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- పెందుర్తిలోని మహా కామేశ్వరి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

సబ్బవరం: మండలంలోని మహిళలు శ్రావణ శుక్రవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సబ్బవరంలోని శ్రీదుర్గమాంబ అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు.

సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన

- ఘనంగా అమ్మవార్ల తిరువీధి
- వెంకన్న ఆలయంలో లక్ష్మీదేవికి కుంకుమార్చన

సింహాచలం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సింహగిరిపైనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేంజేసిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో సింహాసనంపై సింహవల్లీ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి లక్ష కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులను ఆలయ ప్రాంగణంలో వేంజేప చేశారు. పది అవృతలతో లక్ష నామాలను పఠిస్తూ అమ్మవారికి అర్చకులు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు కుంకుమ ప్రసాదం, శేషవస్త్రాన్ని అందించారు. సాయంత్రం అమ్మవార్లను పల్లకిలో అధిష్ఠింపజేసి ఆలయ బేడా తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. అనంతరం సహస్రనామార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, పారాయణదారులు, అర్చకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.


కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారు, సువర్ణ అమ్మవారు


అమ్మవార్లకు హారతి అందిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

లక్ష్మీదేవికి విశేషంగా కుంకుమార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేషంగా కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి, కొలువుదీర్చారు. భక్తుల గోత్రనామాలతో కుంకుమార్చన జరిపారు. సాయంత్రం అమ్మవారి దర్శనానికి అడవివరం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి, వేంకటేశ్వర స్వామికి అర్చకులు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

‘పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ జరపాలి’


ఫార్మాసిటీలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: స్థానిక ఫార్మాసిటీ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ జరిపి, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫార్మాసిటీలో శుక్రవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని ఎసైన్షియా, ఫార్మాసిటీలో సినర్జిన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎసైన్షియా పరిశ్రమలో 17 మంది మరణిస్తే యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ముగ్గురు కార్మికుల మృతికి కారణమైన సినర్జిన్ పరిశ్రమకు రాయితీలు ఇస్తూ, కార్మిక చట్టాలను పట్టించుకోకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆక్షేపించారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు చేయకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులు విధులకు రావాలంటేనే భయపడుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు అవసరమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రాథమిక చికిత్స కోసం స్థానికంగా ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో చిన్న ప్రమాదాలు జరిగినా, పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. ఈలోగానే కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని మండిపడ్డారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేవిలా చూడాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అప్పలరాజు, చిట్టిబాబు, ముసిలినాయుడు, రమణ, సత్తిబాబు, చిలుకునాయుడు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

సబ్బవరం: మొక్కలు నాటడం సామాజిక బాధ్యత కావాలని ఎంపీడీవో రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వనం–మనం కార్యక్రమంలో ఆయన పాల్గొని, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అడవుల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మునగ, జామ, సపోటా తదితర 30 మొక్కల్ని నాటారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, మండల విద్యాశాఖాధికారులు లక్ష్మణరావు, ఎస్ఎస్ఎన్ మూర్తి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పురుషోత్తపురంలోని ఉదయ భాస్కర్ ఆవాస్ అపార్ట్‌మెంట్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అపార్ట్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ ప్రతినిధులు రాంబాబు, దామోదర్, సాయిరాం, పాండురంగారావు, శ్యామల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెగని వాన.. కడలి కల్లోలం



ముత్యాలమ్మపాలెం తీరంలో ఎగసిపడుతున్న అలలు, (ఇన్‌సెట్) సురక్షిత ప్రదేశానికి చేర్చిన పడవలు

పరవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. అల్పపీడన ప్రభావానికి ముత్యాలమ్మపాలెం తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. తీరాన్ని తాకుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగసిపడుతున్న అలల కారణంగా ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలరిపేట, తిక్కవానిపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు వేట విరామం ప్రకటించారు. పడవలు, వలలు, ఇంజన్లను సురక్షిత ప్రదేశాలకు చేర్చుకోవడంలో నిమగ్నమయ్యారు. తుపాను ప్రభావం ఉన్నంత వరకు మత్స్యకారులు సముద్రంపై చేపల వేటకు వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా తీరంలో రెవెన్యూ సిబ్బందిని కాపలాగా ఉంచారు. తాజా వర్షాలు మండలంలో వ్యవసాయ పంటలకు మేలు చేస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వరి, గంటి, కూరగాయల పంటలకు బాగా అనుకూలిస్తాయంటున్నారు. ప్రస్తుత వర్షాలకు కలపాక, స్వయంభూవరం గ్రామాల రైతులు వరి నాట్లలో నిమగ్నమయ్యారు. మండలంలో వేసిన ఖరీఫ్ వరితోపాటు, ఇతర పంటలకు ఈ వర్షాలు ఎంతగానో ఉపకరిస్తాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సూచించారు. ఫ్రైడే–డ్రైడే సందర్భంగా వార్డులోని పాపయ్యరాజుపాలెంలో పారిశుద్ధ్య అధికారులు, సిబ్బందితో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. వారంలో ఒక్క రోజు ఇంట్లోని పాత్రలను ఖాళీ చేసి, డ్రై డే పాటించాలన్నారు. రోమాల నూకరాజు, కృష్ణమూర్తి, ప్రసన్నలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- జీవీఎంసీ పరిధి పెందుర్తి పట్టణంలో పలు చోట్ల జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు పాల్గొని ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల శానిటరీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఫర్నిచర్ దుకాణంలో చోరీ

పెందుర్తి: పట్టణంలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో శుక్రవారం వేకువజామున దొంగలు పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు. పెందుర్తిలో షణ్ముఖ ప్లైవుడ్ దుకాణాన్ని గురువారం రాత్రి మూసేసి యజమాని, సిబ్బంది ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం దుకాణానికి వచ్చేసరికి, షట్టర్ తెరిచి ఉంది. అనుమానం వచ్చి క్యాష్ కౌంటర్‌లో చూడగా అందులోని రూ.3.50 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

కరి మబ్బులు.. చిరు జల్లులు


పెందుర్తి వేంకటాద్రిపై శుక్రవారం సాయంత్రం మేఘాలు అలముకున్నాయి. రెండు రోజులుగా ఈ ప్రాంతంలో చిరుజల్లులు పడుతునే ఉన్నాయి. ఈ క్రమంలో వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన వేంకటాద్రిపై కరి మబ్బులు కమ్ముకుని, స్థానికులకు ఆనందం పంచాయి. – పెందుర్తి